సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23 వేలు, కనిష్టం రూ.10 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20 పలికింది. మార్కెట్‌కు 2,650 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
36.2°/23.3°

జిల్లా పరిధిలో గురువారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలివీచింది.



వైద్యులకు రక్షణగా ప్రత్యేక చట్టం తేవాలి

వైద్యులపై దాడులు, అఘాయిత్యాలు జరగడం సభ్య సమాజం తల దించుకునే పరిస్థితి. వైద్యులకు రక్షణగా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా ప్రతిఒక్కరిని కలచివేసింది. ఇలాంటి సంఘటనలు జరగకుండా చట్టాల్లో సమూల మార్పులు తీసుకురావాలి.

– టీ.ఎం.బషీర్, వైద్యుడు, ధర్మవరం

వైద్య సిబ్బందికి భద్రత పెంచాలి

కోల్‌కత్తాలో జూనియర్ మహిళా వైద్యురాలుపై జరిగిన సంఘటన అత్యంత బాధాకరం. ప్రాణాలు పోసే వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా? ప్రతి ప్రభుత్వ వైద్యశాలలో పని చేసే మహిళా వైద్యులకు, సిబ్బందికి ప్రభుత్వం భద్రత కల్పించాలి. మహిళా రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలి. ఆస్పత్రుల్లోనూ మహిళా సిబ్బందికి భద్రతతో పాటు అన్ని సౌకర్యాలను కల్పించాలి. రాత్రివేళ్లలో పోలీసులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

– సీవీ మదన్‌కుమార్, వైద్యుడు, కదిరి



న్యూస్‌రీల్

31న ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



హిందూపురం టౌన్: జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న హిందూపురం పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ సీనియర్ మహిళా జిల్లా జట్టుకు ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఎంపికలో పాల్గొనే వారు 2009 జూలై 31కి ముందు జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పీసీఎంఏ (మెడికల్ సర్టిఫికెట్), తల్లిదండ్రుల సమ్మతి పత్రం తీసుకొని రావాలన్నారు. మరిన్ని వివరాలను ఫుట్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి బీకే మహమ్మద్ సలీమ్ సెల్ నంబర్ 8099598958ను సంప్రదించాలని సూచించారు.

మద్యం విక్రయిస్తూ పట్టుబడిన టీడీపీ నాయకుడు



టీడీపీ నేత నారాయణమూర్తి ఇంట్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

బత్తలపల్లి: అక్రమ మద్యం కేసులో పోలీసులు ఎట్టకేలకు టీడీపీ నాయకుడు పత్తిపాటి నారాయణమూర్తి అరెస్టును చూపారు. ఇందులో భాగంగానే న్యాయమూర్తి ముందు కూడా హాజరుపర్చినట్లు వెల్లడించారు. గురువారం ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాలను విలేకరులకు తెలియజేశారు. మండలంలోని చిత్రావతి నది సమీపంలోని జాతీయ రహదారి పక్కన దంపెట్ల గ్రామానికి చెందిన టీడీపీ నేత నారాయణమూర్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఇందులో భాగంగానే ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో నారాయణమూర్తి నుంచి 79 దారు హౌస్ బాటిళ్లు, 24 కింగ్ ఫిషర్ బీర్లు, 4 మాన్షన్ హౌస్, ఆరు క్వార్టర్ బాటిళ్లు, మూడు కొరియర్ క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నారాయణమూర్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అలాగే గురువారం మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో బెల్ట్‌షాప్ నిర్వాహకుడు రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఆయన వద్ద నుంచి 352 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ సోమశేఖర్ మూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపే పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: సెప్టెంబర్ నెలకు సంబంధించిన సామాజిక భద్రతా పింఛన్లను(ఎన్‌టీఆర్ భరోసా) ఆగష్టు 31వ తేదీనే పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.సెప్టెంబర్ 1వ తేదీ ఉద్యోగులకు సెలవు కావడంతో శనివారమే పంపిణీ ప్రారంభించాలని కలెక్టర్ చేతన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పింఛన్లకు సంబంధించిన నగదు మొత్తం 30వ తేదీనే బ్యాంకుల నుంచి డ్రా చేసి సిద్ధంగా ఉంచుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. 31న పంపిణీ చేయని పింఛన్ మొత్తాన్ని 2న (సోమవారం) పంపిణీ చేయాలన్నారు. పింఛన్ పంపిణీకి సంబంధించి గ్రామ సంఘాల వద్ద ఉన్న బయోమెట్రిక్ డివైస్‌లను వాడుకోవాలన్నారు.

2,68,079 పింఛన్లు మంజూరు..

సెప్టెంబర్ నెలకు సంబంధించి జిల్లాలో 2,68,079 మందికి పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ఇందుకోసం రూ.115.07 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. 2వ తేదీ సాయంత్రం వరకూ పింఛన్లు చెల్లించి తక్కిన మొత్తాన్ని రెండు రోజుల్లోపు సెర్ప్‌కు తిరిగి చెల్లించాలన్నారు.

పాడెక్కిన పాడి!

మొన్నటి దాకా జిల్లాలోని పాడి రైతుల జీవనం ఎంతో సాఫీగా సాగింది. ప్రతి నెలా రూ. 30 వేల నుంచి రూ.లక్ష దాకా ఆదాయం వస్తుండటంతో ఏ ఇబ్బంది లేకుండా ఎంతో సంతోషంగా తమ కుటుంబాలను పోషించుకునేవారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాడి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. అమూల్ పాలసేకరణ నిలిచిపోవడంతో వారంతా తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రైవేటు డెయిరీలు రేట్లను తగ్గించేయడంతో లబోదిబోమంటున్నారు.

- 'అమూల్ ' పాల సేకరణ నిలుపుదలతో రైతులకు కష్టాలు
- పాల ధర తగ్గించేసిన ప్రైవేట్ డెయిరీలు
- లక్షలాది కుటుంబాలపై ప్రభావం
- తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతల గగ్గోలు



పుట్టపర్తి అర్బన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాడి రైతులకు పెద్ద పీట వేశారు. పాల వెల్లువ కార్యక్రమం ద్వారా 'అమూల్' సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని పాల ధరలను పెంచడంతో లక్షలాది మంది పాడి వైపు మొగ్గు చూపారు. లీటరు పాల ధర కేవలం రూ.25 నుంచి రూ.30 వరకూ ఉన్న సమయంలో అమూల్ కార్యకలాపాలు ప్రారంభంతో ఒక్కసారిగా పాల ధరలు రూ.40కి పైగా చేరుకున్నాయి. దీంతో పాడి లాభసాటిగా మారింది. ఈ నేపథ్యంలో ఒక్క ఆవు ఉన్న రైతు రెండు, మూడేసి ఆవులను కొనుగోలు చేసి లబ్ధి పొందారు. వ్యవసాయం లాభసాటిగా లేదని రైతులంతా పాడి ఆవులపై ఆధారపడి జీవనం సాగించే స్థితికి చేరుకున్నారు. ఒక్కో రైతు రూ.10 వేలు, రూ.50 వేలు దాటి రూ. లక్ష వరకూ తీసుకునే స్థాయికి చేరుకున్నారు. పాడి ఆవులను కామధేనువుగా కొలుస్తూ వచ్చారు.

కూటమి రాకతో మారిన పరిస్థితులు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అమూల్‌పై పగ బట్టి పాలసేకరణ ఆగేలా చేశారు. దీంతో ఇన్నాళ్లూ స్తబ్దుగా ఉన్న ప్రైవేటు డెయిరీల నిర్వాహకులు రెచ్చిపోతున్నార. పాడి రైతుల నుంచి సేకరించే పాల ధరలను అమాంతం తగ్గించేశారు. ఒక్కసారిగా లీటరుపై రూ.5 నుంచి రూ.10 వరకూ తగ్గించి సేకరిస్తున్నారు. ఇదేంటని రైతులు ఎదురు తిరిగితే తామేమీ చేయలేమని నిర్వాహకులు చేతులెత్తేశారు. ఆవు , గేదె పాలలో డెయిరీలు చూసే ఫ్యాట్ , ఎస్ఎన్ఎఫ్‌లను మిషన్లలో తగ్గించి చూపుతూ ధరల్లో కోతలు విధిస్తున్నారు. దీంతో లక్షలాది మంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఒక్కో పాడి రైతు నెలకు వేలాది రూపాయలు కోల్పోతున్నారు.

ప్రస్తుతం ప్రైవేటు డెయిరీలు పాలకు చెల్లిస్తున్న గరిష్ట ధర (లీటరుకు రూ.లలో)		
డెయిరీ	ఆవు పాలు	గేదె పాలు
హెరిటేజ్	32	65
గాయత్రి	30	58
దొడ్ల	33	64
శ్రీజ	31	60
తిరుమల	28	57
ఆరోక్య	30	60

2 లక్షల మందికి నష్టం

అమూల్ డెయిరీ పాల సేకరణ నిలిచిపోవడంతో ప్రత్యక్షంగా 2,146 మంది పాడి రైతులు నష్టపోతున్నారు. రేట్లు తగ్గించడంతో పరోక్షంగా 2 లక్షల మందిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అమూల్ డెయిరీలకు పాలు పోసే రైతులకు లీటరుకు రూ.42 చొప్పున ధరలు వస్తుండేవి. దీంతో పది లీటర్ల పాలు పోసే రైతుకు రూ.4,200 గిట్టుబాటు అయ్యేది. అమూల్ పాలసేకరణ నిలిపేయడంతో అందరూ ప్రైవేటు డెయిరీలకు పాలు పోస్తున్నారు. లీటర్ పాలకు రూ.30 నుంచి రూ.33 వరకూ మాత్రమే ధరలు వస్తున్నాయి. ధరలు తగ్గించి కొనుగోలు చేస్తుండటంతో సదరు రైతు నెలకు ఏకంగా రూ.1,200 నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు (ఫైల్)

రోజుకు 30,550 లీటర్ల పాలు

జిల్లాలో అమూల్ డెయిరీలకు తలుపుల, కదిరి, నల్లచెరువు బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు ఉన్నాయి. 146 అమూల్ డెయిరీలు ఉండగా 2,146 మంది రైతులు రోజుకు రెండు పూటల పాలు పోస్తూ లబ్ధి పొందేవారు. ఇలా రోజుకు సుమారు 30,550 లీటర్ల పాలు అమూల్ ద్వారా సేకరిస్తున్నారు. జిల్లాలో పాడి ఆవులు 1.70 లక్షలు ఉండగా గేదెలు 30 వేలకు పైగా ఉన్నాయి. ప్రైవేటు డెయిరీలు ధరలు తగ్గించడంతో ఏకంగా రెండు లక్షల మంది రైతులు నష్టపోతున్నారు.



అమూల్ డెయిరీ లీటరు పాలకు చెల్లించిన గరిష్ట ధర	
ఆవు పాలు	రూ.42.50
గేదె పాలు	రూ.80



జిల్లాలో పాడి వివరాలు ఇలా...	
పాడి ఆవులు	1.70 లక్షలు
గేదెలు	30,500
పాడి రైతులు	2 లక్షల మంది

మా ఉసురు తగులుతుంది



అమూల్ పాలసేకరణ నిలిపేయడంతో ప్రైవేటు డెయిరీలు పాల ధరను అమాంతం తగ్గించాయి. దీంతో ప్రతి నెలా రూ. 2,100 నష్ట పోవాల్సి వస్తోంది. నేను రోజూ 10 లీటర్ల పాలు పోస్తున్నాను. నెలకు రూ.12,600 తీసుకుంటున్నాను. అమూల్ డెయిరీలో లీటరుకు రూ.42 ధర వచ్చేది. వేరే డెయిరీకి పాలు పోయడం ద్వారా లీటరుకు రూ.35 మాత్రమే ఇస్తున్నారు. దీంతో ఇప్పుడు నెలకు రూ. 10,500 తీసుకుంటున్నాను. కూటమి ప్రభుత్వానికి పాడి రైతు ఉసురు తప్పక తగులుతుంది.

– ప్రభావతి, మరువపల్లి, తలుపుల మండలం

మద్దతు ధర లేకపోతే ఎలా?



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాడి రైతులు పోసే పాలకు మద్దతు ధర లభించేది. కూటమి ప్రభుత్వం రాగానే పాల ధరలను తగ్గించారు. లీటరుకు రూ.6 నుంచి రూ.10 వరకూ తగ్గించి సేకరిస్తున్నారు. గతంలో మా గ్రామంలో అమూల్ డెయిరీ లీటరుకు రూ.42.50 ధర ఇచ్చేది. ప్రస్తుతం అదే పాలకు రూ.30 ధర వేస్తున్నారు. దీంతో లీటరుకు రూ.12.50 కోల్పోవాల్సి వచ్చింది. దీంతో అన్ని విధాలా నష్టపోతున్నాము. అమూల్ డెయిరీలను కొనసాగించాలి.

– ఆకుల రత్నమ్మ, బండార్లపల్లి, నల్లచెరువు

ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నేడు బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం సిటీ: గ్రామ సచివాలయాల్లో పని చేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించి అనంతపురంలోని పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఎస్ఈ కేవీకేవీ ప్రసాద్ గురువారం తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మొత్తం 104 ఖాళీలు ఉండగా, 252 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. వారందరూ అనంతపురంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కానున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. తొలిసారి నిర్వహిస్తున్న బదిలీల కౌన్సెలింగ్‌లో అనేక వింతలు, విడ్డూరాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే సచివాలయ ఉద్యోగులకు ఆయా శాఖాధిపతుల ఆధ్వర్యంలో బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పీఆర్ శాఖ ఎస్ఈ ప్రసాద్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితా రూపొందించారు. దరఖాస్తు చేసుకొని కౌన్సెలింగ్‌కు హాజరు కాకపోతే అటువంటి వారికి బదిలీలు ఉండవని స్పష్టం చేశారు.

పులమతి వ్యాయామ ఉపాధ్యాయుడికి ఎక్సలెన్సీ అవార్డు



కలెక్టర్ చేతన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పీడీ రామాంజినేయులు

లేపాక్షి/పరిగి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగానే లేపాక్షి మండలంలోని పులమతి పాఠశాలకు చెందిన పీడీ రామాంజినేయులు కలెక్టర్ టీఎస్.చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. వరుసగా మూడు సంవత్సరాలు పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణించారని ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు తెలిపారు. 2021–2022లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగో స్థానం, 2022–2023లో శ్రీసత్యసాయి జిల్లాలో నాలుగో స్థానం, 2023–2024లో మూడో స్థానం వచ్చినందుకు అవార్డు దక్కిందన్నారు. అలాగే పరిగి మండలం కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్ పీఈటీ షభానా కూడా అవార్డు అందుకున్నారు.

తెలుగు భాషను పరిరక్షించుకుందాం

- కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: మాతృభాషతోనే మానవ జాతి మనుగడ సాధ్యమవుతుందని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకటరామమూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఇన్‌చార్జ్ డీఆర్ఓ భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ తెలుగు భాష కమ్మదనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. తెలుగును ప్రేమిస్తే అమ్మను ప్రేమించినట్లేనని స్పష్టం చేశారు. గ్రాంథిక భాషకు పట్టం కడుతున్న నాటి రోజుల్లో వ్యవహారిక భాషను కాపాడేందుకు గిడుగు పోరాటం చేశారన్నారు. నేటితరం ఆయనను ఆదర్శంగా తీసుకొని ఎంచుకున్న రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం..

జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం కలెక్టర్ చేతన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఆగస్టు 29న జరుపుకుంటున్నామన్నారు. హాకీ చరిత్రలో ధ్యాన్‌చంద్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. హాకీలో 1928, 1932, 1936లలో స్వర్ణ పతకాలు గెలుచుకోవడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ధ్యాన్‌చంద్ గొప్పతనం కేవలం హాకీలోనే కాకుండా క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, దేశభక్తి విషయంలోనూ ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. అందుకే ఆయనను కేంద్ర ప్రభుత్వం 1956లో పద్మభూషణ్‌తో సత్కరించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఛాయా చిత్ర ప్రదర్శనలు, క్రీడా పోటీలు నిర్వహించారు. పలువురు పీడీలు, పీఈటీలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా సాధికార సంస్థ అధికారి ఉదయ్‌కుమార్, టూరిజం అధికారి ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ చేతన్

మంత్రి సవిత కనుసన్నల్లోనే ఇసుక దందా

- మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి: టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెనుకొండ నియోజకవర్గంలో బీసీ సంక్షేమశాఖా మంత్రి సవిత కనుసన్నల్లోనే అక్రమార్కులు ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త ఉషశ్రీచరణ్ విమర్శించారు. గురవారం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె సంగమేశ్వరంపల్లి ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. పరిగి మండలంలోని జయమంగళీ, పెన్నా నదుల నుంచి మంత్రి సవిత అండదండలతోనే టీడీపీ , కూటమి నేతలు ఇసుకను అక్రమంగా తవ్వి బెంగళూరుకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారన్నారు. అడ్డుకోవాల్సిన పోలీసులు, అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీసీలను మోసం చేసిన కూటమి..

అధికారంలోకి రాక మునుపు బీసీలకు యాభై ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పిన టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం కాగానే బీసీలను అణగదొక్కుతున్నారని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీలను బ్యాక్‌బోన్ క్యాస్టుగా అనేక విధాలుగా అభివృద్ధి వైపు నడిపించారన్నారు. 50 ఏళ్లు పైబడిన వారందరికీ పింఛన్ ఇస్తామన్న కూటమి నాయకుల హామీ అటకెక్కిందని, దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత బీసీ సంక్షమశాఖా మంత్రిగా ఉన్న సవితపై ఉందని, బీసీ కులాల ప్రజలకు ఆమె సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా నేటికీ పింఛన్ తప్ప మరో పథకాన్ని అమలు చేయలేదన్నారు. ఈవీఎంలు తారుమారు చేసినంత సులువుగా వైఎస్సార్‌సీపీపై ప్రజలకున్న విశ్వాసాన్ని చెరపలేరన్నారు.

పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం సరికాదు..

ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలను మరోసారి మోసం చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఉషశ్రీ చరణ్ తెలిపారు. నాడు ఎంపీ మోపిదేవి వెంకటరమణపై అనేక ఆరోపణలు చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నేడు అదే వ్యక్తిపై చేసిన ఆరోపణలన్నీ అబద్ధమని పరోక్షంగా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంతమంది వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను టీడీపీలో చేర్చుకున్నా ప్రజల్లో జగనన్నపై ప్రజలల్లో ఉన్న ఆదరణను తగ్గించలేరని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులపై టీడీపీ ప్రోత్సహించడం సమంజసం కాదన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

నేరాల నియంత్రణకు కృషి చేయండి

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణకు పోలీస్ అధికారులు గట్టిగా పనిచేసి పోలీస్‌శాఖపై ప్రజల్లో గౌరవం పెంచే విధంగా చూడాలని ఎస్పీ రత్న పోలీస్ అధికారులకు సూచించారు. గురువారం పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్లలో నమోదైన గ్రేవ్ ,నాన్‌గ్రేవ్ కేసులు వివరాలు తెలుసుకొని నేరాలు, శిక్షలు, కోర్టు కేసుల పురోగతిపై పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ రత్న మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ ఎస్టీ మర్డర్, పోక్సో , రోడ్డు ప్రమాదాల కేసులపై ప్రతి ఒక్కరూ దృష్టి సారిస్తే జిల్లాలో క్రైమ్‌రేటును తగ్గించవచ్చన్నారు. ప్రత్యేక కార్యాచరణతో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. సాటు సారా విక్రయాలు, అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపాలన్నారు. మిస్సింగ్, చోరీ కేసులపై దృష్టి సారించి రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లకు క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. వారి కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సైబర్ నేరాలపై దృష్టి సారించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబరిచిన 36 మంది పోలీస్ అధికారులకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అన్ని సబ్ డివిజన్ల డీఎస్పీలు ఆర్ల శ్రీనివాసులు, శ్రీలత, మహేష్ , లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

కొనసాగుతున్న కార్మికుల నిరసన

బత్తలపల్లి: సత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికుల నిరసన కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న సత్యసాయి మంచి నీటి పథకం ట్యాంకుల వద్ద 8వ రోజూ వారు ఆందోళన చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సత్యసాయి ట్రస్ట్ ప్రజలకు తాగునీటిని అందిస్తోంది. తాగునీటి సరఫరాను పర్యవేక్షిస్తున్న సంస్థ కార్మికులకు గత ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఎనిమిది రోజులుగా సత్యసాయి మంచినీటి సరఫరాను నిలిపివేశారు. పలుచోట్ల జీతాల చెల్లింపు కోసం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదని, ఈఎస్ఐ, ఈపీఎఫ్ డబ్బులు చెల్లించలేదని, అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకూ నిరసన కొనసాగిస్తామని తేల్చి చెబుతున్నారు.



బుక్కపట్నం చెరువులో జల దీక్ష చేస్తూ నిరసన తెలుపుతున్న సత్యసాయి కార్మికులు



రక్షణ కల్పించాలి

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఉదంతం తీవ్రంగా కలిచివేసింది. ఇలాంటి ఘటనలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలి. నేరస్తులకు కఠిన శిక్షలు తక్షణమే అమలు చేయాలి. ప్రతి ఆస్పత్రిలోనూ నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలి. ప్రశాంత వాతావరణంలో వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ మంజునాథ్, ప్రభుత్వాస్పత్రి, హిందూపురం

కఠిన శిక్షలు అమలు చేయాలి

వైద్యుడు దేవుడితో సమానం అంటారు. అలాంటి వైద్యులపైనే అమానుషంగా ప్రవర్తించడం దారుణం. దాడులు, అత్యాచారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. తక్షణమే వారిని శిక్షించేలా చట్టాలను తీసుకురావాలి. మహిళా డాక్టర్లు విధులు నిర్వహించే ఆస్పత్రుల వద్ద పటిష్టమైన భద్రత కల్పించాలి. ఆస్పత్రుల వద్ద రాత్రి సమయాల్లో పోలీసుల రక్షణ పెరగాలి. ధైర్యంగా వైద్యమందించేలా వైద్యులకు, సిబ్బందికి భరోసా కల్పించాలి.

– డాక్టర్ అఫ్తాబ్, చిన్నపిల్లల వైద్య నిపుణులు, ప్రభుత్వాస్పత్రి, హిందూపురం



క్లుప్తంగా

వైద్య సేవల్లో అలసత్వం వీడండి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెల్వియా సాల్మన్

చెన్నేకొత్తపల్లి: వైద్య సేవల్లో అలసత్వం వీడి రోగులకు నాణ్యమైన చికిత్సలు అందజేయాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెల్వియా సాల్మన్ ఆదేశించారు. సీకేపల్లి మండలం ఎన్‌ఎస్‌గేట్‌లోని పీహెచ్‌సీని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని గదులు, పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. రోజువారీ ఓపీపై డాక్టర్ రవినాయక్‌తో ఆరా తీశారు. గ్రామాల్లో పని చేసే వైద్య సిబ్బంది ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై చైతన్య పరచాలన్నారు. ఆమె వెంట డీడీఓ డాక్టర్ సరిత ఉన్నారు.

మూడు పిల్లలకు జన్మనిచ్చిన మేక



మడకశిర రూరల్: మండలంలోని ఎల్లోటి గ్రామానికి చెందిన మహిళా రైతు సునందమ్మ పెంచుతున్న మేక గురువారం మూడు పిల్లలకు జన్మనిచ్చింది. తల్లి మేకతో పాటు పిల్లలూ ఆరోగ్యంగా ఉండడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

11 మండలాల్లో వర్షం

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. జిల్లాలోని కనగానపల్లిలో అత్యధికంగా 23.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అమరాపురంలో 15.2, ధర్మవరంలో 9.6, రొళ్లలో 9.4, లేపాక్షిలో 6.2, రామగిరిలో 5.6, హిందూపురంలో 5.6, రొద్దంలో 4.8, గుడిబండలో 3.4, బత్తలపల్లిలో 2.2, అమడగూరులో 2 మి.మీ వర్షం కురిసింది.

క్రికెట్ పండుగకు సర్వం సిద్ధం



ముస్తాబైన ఏసీజీలోని ప్రధాన మైదానం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాంఛో ఫెర్రర్

- సెప్టెంబర్ 5 నుంచి అనంతపురంలో క్రికెట్ సందడి
- దులీప్ ట్రోఫీ బరిలో 45 మంది టాప్ క్రికెటర్లు
- ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంఛో ఫెర్రర్

అనంతపురం కార్పొరేషన్: 'అనంత వేదికగా క్రికెట్ పండుగకు సర్వమూ సిద్ధమైంది. దేశవాళీ క్రికెట్‌లో ప్రఖ్యాతిగాంచిన దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు అనంత క్రీడా గ్రామం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. దాదాపు 20 నుంచి 25 రోజుల పాటు క్రికెట్ సందడి ఉంటుంది. జిల్లాలో తొలిసారి ఓ పెద్ద టోర్నీ నిర్వహణకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకున్న బీసీసీఐకు ప్రత్యేక కృతజ్ఞతలు. జిల్లా వాసులు, క్రీడాభిమానుల సహకారంతో క్రికెట్ టోర్నీ విజయవంతం చేస్తాం' అని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) త్రీమెన్ కమిటీ సభ్యులు, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అన్నారు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్ (ఏసీజీ) ఆటోరియంలో దులీప్ ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ క్రికెట్ టోర్నీల తర్వాత అదే స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా దులీప్ ట్రోఫీను బీసీసీఐ నిర్వహిస్తోందన్నారు. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న శుభమన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, కేఎల్ రాహుల్, శివమ్ దూబే, రిషబ్‌పంత్, మయాంక్ అగర్వాల్, శ్రేయస్ అయ్యర్, కులదీప్ యాదవ్, ఇషాన్ కిషన్, అక్షర్‌పటేల్, అర్ష్‌దీప్ సింగ్, తదితర దేశంలోనే టాప్ 45 మంది క్రీడాకారులు ఈ ట్రోఫీలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో క్రీడాకారుల భద్రతకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ తదితర అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారన్నారు. వచ్చే నెల 5 నుంచి 22వ తేదీ వరకూ ఏసీజీలోని రెండు మైదానాల్లో ఐదు మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. ఒక్కో మ్యాచ్ నాలుగు రోజుల పాటు (టెస్ట్ మ్యాచ్) ఉంటుందన్నారు. వచ్చే నెల 5న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో భారత్ ఏ, బీల మధ్య, అదే రోజున అనంతపురంలో సీ, డీ జట్ల మధ్య మ్యాచ్‌తో దులీఫ్ ట్రోఫీ మొదలవుతుందన్నారు.

ప్రత్యక్ష వీక్షణకు 4వేల మందికి అవకాశం

ఈ మ్యాచ్‌లు వీక్షించేందుకు రోజూ 4 వేల మందికి పాస్‌లు అందజేస్తున్నట్లు మాంఛోఫెర్రర్ తెలిపారు. మాచ్‌ల వీక్షణ ఉచితం మాత్రం కాదని స్పష్టం చేశారు. ఈ నెల 31న ఉదయం 11 గంటలకు ఏసీజీలో పాస్‌ల పంపిణీ ఉంటుందన్నారు. రోజూ కౌంటర్ ఉంటుందన్నారు. ఒకరికి ఒక పాస్ మాత్రమే ఇస్తామన్నారు. మ్యాచ్‌లు జరిగే రోజున ఉదయం 8.30 గంటలకు గ్రౌండ్‌లో ప్రవేశముంటుందని, 10.30 గంటలకు గేట్లు మూసివేస్తారన్నారు. పార్కింగ్ ఏసీజీ లోపల ఉంటుందన్నారు. ఏసీజీలో జరిగే ప్రతి మ్యాచ్ స్టార్ స్పోర్ట్స్, జియోలో ప్రత్యక్ష ప్రసారం అవుతాయన్నారు. సమావేశంలో టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి, మాజీ రంజీ క్రీడాకారుడు షాబుద్దీన్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మీడియా మేనేజర్ రాజగోపాల్, అనంతపురం క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు ఆచారి, సభ్యులు పగడాల మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి వెళుతూ.. పరలోకాలకు



మృతుడు వీరేష్

ఉరవకొండ: స్నేహితుడి పెళ్లికని బయలుదేరిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా... మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని బళ్లారికి చెందిన వీరేష్, గోవిందరాజులు గురువారం అనంతపురంలో జరుగుతున్న తమ స్నేహితుడి వివాహ వేడుకలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. స్పీడ్ తగ్గించాలని పదేపదే గోవిందరాజులు సూచించినా వాహనాన్ని నడుపుతున్న వీరేష్ పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఉరవకొండ మండలం కోనాపురం గ్రామ సమీపంలోకి చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వీరేష్ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న గోవిందరాజులును స్థానికులు వెంటనే ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. కాగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై ఉరవకొండ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సెల్‌ఫోన్ దొంగ పట్టివేత



అనుమానితుడిని బంధిస్తున్న ఆర్డీటీ సెక్యూరిటీ సిబ్బంది

బత్తలపల్లి: స్థానిక ఆర్డీటీ ఆస్పత్రిలో రోగుల సహాయకులు, బంధువుల సెల్‌ఫోన్లను అపహరిస్తూ ఓ దొంగ పట్టుబడ్డాడు. వివరాలు... ఆర్డీటీ ఆస్పత్రిలో అడ్మిషన్‌లో ఉన్న రోగుల కోసం వచ్చిన సహాయకులు, బంధువులు రాత్రి పూట అదే ఆస్పత్రి ఆవరణలో నిద్రిస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి గాఢ నిద్రలో ఉన్న వారి సెల్‌ఫోన్లు, ఇతర విలువైన సామగ్రిని అపహరించేందుకు ప్రయత్నిస్తున్న ఓ యువకుడిని అక్కడి సెక్యూరిటీ సిబ్బంది గమనించి వెంటనే బంధించారు. గురువారం ఉదయం ఆస్పత్రి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి, వారి ఆదేశాల మేరకు పోలీసులకు అప్పగించారు. విచారణలో నిందితుడిని ముదిగుబ్బ మండలం గుంజేపల్లికి చెందిన కుమార్‌గా గుర్తించారు. అయితే తాను దొంగతనం చేయలేదని ఓ పిల్లోడు తనకు సెల్‌ఫోన్ తీసుకువచ్చి ఇచ్చాడని ఈ సందర్భంగా పోలీసుల ఎదుట సదరు యువకుడు వాపోయాడు. అయితే ఘటనపై పోలీసులు తమదైన శైలిలో లోతైన విచారణ చేపట్టారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బుక్కపట్నం: కుటుంబ కలహాల నేపథ్యంలో కన్న తండ్రినే హతమార్చిన కేసులో నిందితులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్‌ఐ శివతో కలసి సీఐ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. ఈనెల 27న యలగలవంక గ్రామానికి చెందిన తిప్పేస్వామి నాయక్(53) హత్య జరిగిన విషయం తెలిసిందే. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో గురువారం ఉదయం గుండ్లపల్లి క్రాస్ వద్ద తచ్చాడుతున్న హతుడి కుమారుడు రాజశేఖర్ నాయక్, తిప్పేస్వామి నాయక్ భార్య లక్ష్మీబాయిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో నేరం తామే చేశామని అంగీకరించారు. మద్యానికి బానిసలైన తండ్రి, కొడుకు తరచూ గొడవలు పడేవారని, అంతేకాక అప్పులు కూడా ఎక్కువ కావడంతో కొంత భూమిని తిప్పేస్వామినాయక్ విక్రయించాడు. దీంతో కుటుంబంలో గొడవలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 27న ఘర్షణ పడిన కొడుకు, తల్లి.. పథకం ప్రకారం తిప్పేస్వామినాయక్‌ను గొంతు నులిమి హతమార్చారు. హతుడి కుమార్తె జ్యోతిబాయి ఫిర్యాదు మేరకు నిందితులపై చార్జిషీట్ దాఖలు చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

సెప్టెంబరు 5 నుంచి నిరవధిక సమ్మె

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులు

అనంతపురం అర్బన్: శ్రీసత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికుల వేతన, పీఎఫ్ బకాయిలు చెల్లించడంతో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తాగునీటి పథకాల కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఓబులు మండిపడ్డారు. సమస్య పరిష్కారానికి సెప్టెంబరు 5వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. గురువారం స్థానిక జేవీవీ కార్యాలయంలో తాగునీటి పథకం కార్మికుల సంఘం సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. కార్మికుల నిరవధిక సమ్మె కారణంగా తలెత్తే సమస్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తాగునీటి పథకాలకు శాశ్వత ప్రాతిపదికన ప్రత్యేక బడ్జెట్ కేటాయించి పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఏసురత్నం, ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణుడు, నాయకులు గోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, తిప్పేస్వామి, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిషనర్‌గా ప్రహ్లాద



పుట్టపర్తి టౌన్: స్థానిక మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ప్రహ్లాద నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న అంజయ్యను బదిలీ చేస్తూ కదిరి మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ప్రహ్లాదను ఓన్ పే కింద కమిషనర్‌గా నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

యువకుడి ఆత్మహత్య

తనకల్లు: మండలంలోని చిన్నపల్లికి చెందిన సాయికుమార్ (23) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... డ్రైవర్‌గా పనిచేస్తున్న సాయికుమార్‌కు మూడు నెలల క్రితమే వివాహమైంది. రోజూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుంటుండడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో క్షణికావేశానికి లోనైన సాయికుమార్... గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు గుర్తించి అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 30న ఆలయంలో సామూహిక శ్రావణ వరమహాలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు కలశ పూజ, 10 గంటలకు వరలక్ష్మీ వ్రతం ప్రారంభమవుతుందన్నారు. వ్రతానికి కావాల్సిన పూజా సామగ్రిని దేవస్థానం వారే ఇస్తారని తెలియజేశారు. మహిళలు కలశం చెంబు మాత్రమే తెచ్చుకోవాలన్నారు.

ఎంటెక్, బీటెక్ ఫలితాల విడుదల

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూ పరిధిలో జూలైలో నిర్వహించిన ఎంటెక్, ఎంబీఏ సెమిస్టర్ రెగ్యులేషన్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. వీసీ ఆదేశాలతో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్‌నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ ఆచార్య ఏ.పి శివకుమార్, అడిషనల్ కంట్రోలర్ ఆచార్య జి. శంకర్ శేఖర్, డాక్టర్ ఎం. అంకారావు, డాక్టర్ శ్రీధర్‌లు ఫలితాలను ప్రకటించారు. జేఎన్‌టియు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అభ్యర్థులకు సూచించారు.

ప్రమాదంలో యువకుడి మృతి



లవకుమార్ (ఫైల్)

పెనుకొండ రూరల్: లారీ ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం పెద్దమంతూరు గ్రామానికి చెందిన లవకుమార్ (28) కియా అనుబంధ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేసేవాడు. గురువారం ఉదయం విధుల్లో పాల్గొనేందుకు స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆయన... 44వ జాతీయ రహదారిపై హరిపురం వద్దకు చేరుకోగానే స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహనం స్పీడ్ తగ్గించాడు. అదే సమయంలో వెనుకనే వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన లవకుమార్‌ను వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించిక ఆయన మృతి చెందాడు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు కియా పోలీసులు తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు.. ఇద్దరి దుర్మరణం



ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన కారు

హిందూపురం అర్బన్: కారు చెట్టును ఢీకొని ఇద్దరు మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన రాష్ట్ర సరిహద్దులో కుడుములకుంటె పారిశ్రామిక వాడ సమీపంలో జరిగింది. హిందూపురం పారిశ్రామిక వాడలోని శ్యాం ఫైరెష్ స్టీల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఉత్తర ప్రదేశ్‌లోని ఖానాపూర్‌కు చెందిన సూరజ్(27), కమల్ (28) జైసింగ్.యు.జైసింగ్ బుధవారం రాత్రి విధులు ముగించుకుని ఇన్నోవా కారులో గౌరిబిదనూరు వైపు వెళుతుండగా డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో అదుపు తప్పి చెట్టును ఢీకొంది. కారు నుజ్జునుజ్జు కాగా సూరజ్, కమల్ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన జైసింగ్, యు.జైసింగ్‌ను గౌరిబిదనూరు ప్రభుత్వ ఆస్పత్రికి, మరో ఇద్దరిని హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మృత్యువులోనూ వీడని బంధం

వివాహ బంధంతో ఒక్కటైన వారి బంధం జీవన పయనంలోనూ అంతే అనుబంధంగా సాగింది. పెళ్లి సమయంలో నాతిచరామి అంటూ జీవితాంతం కలసి ఉంటామని ప్రమాణం చేసిన ఆ దంపతుల బంధం మృత్యువులోనూ వీడలేదు. గంటల వ్యవధిలోనే కుటుంబ పెద్దలు మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. అలాగే ఒకే తల్లి కడుపున పుట్టిన అన్నదమ్ములనూ ప్రమాదం రూపంలో మృత్యువు కబలించింది. జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఘటనలతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



పంపాపతి (ఫైల్)



శివగంగమ్మ (ఫైల్)



సాయి (ఫైల్)



చిన్న (ఫైల్)

- డెంగీ బారిన పడి భార్య మృతి
- విషయం తెలియగానే గుండెపోటుతో కన్నుమూసిన భర్త
- మరో ప్రమాదంలో అన్నదమ్ముల మృతి

రాయదుర్గం(డి హీరేహాళ్): డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామ పంచాయతీ పరిధిలోని నల్లదిబ్బ గ్రామానికి చెందిన గొల్ల శివగంగమ్మ (59), పంపాపతి (68) దంపతులకు ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో కుమార్తె ఏకాంతమ్మ అనంతపురంలో నర్సింగ్ కోర్సు చేస్తోంది. కుమారుడు లోకానంద కూడా అనంతపురంలోని హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. మరో కుమారుడు బసవరాజు వైకల్యంతో బాధపడుతుండడంతో ఇంటి పట్టునే ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం జ్వరం బారిన శివగంగమ్మకు బళ్లారిలోని ఆస్పత్రిలో చేర్పించారు. డెంగీ జ్వరంతో బాధపడుతున్నట్లు అక్కడి వైద్యులు నిర్ధారించి, చికిత్స అందజేస్తున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం ఆమె మృతి చెందింది. భార్య మరణవార్త విని తట్టుకోలేని భర్త కుమిలి కుమిలి ఏడుస్తూ గుండెపోటుకు గురై మృతి చెందాడు. గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులు మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. విషయం తెలియగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గుండెలవిసేలా రోదిస్తున్న పిల్లలు ఓదార్చడం ఎవరితరం కాలేదు. నిరుపేద రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అన్నదమ్ములను బలిగొన్న ప్రమాదం

పామిడి: స్థానిక 44వ జాతీయ రహదారిపై క్రూజర్ వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న అన్నదమ్ములు మృతిచెందారు. పోలీసులు తెలిపిన మేరకు... మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాకు చెందిన 25 మంది బతుకు తెరువు కోసం క్రూజర్ వాహనంలో కేరళకు బయలుదేరారు. పామిడిలోని చైతన్య కాలనీ సమీపంలోకి చేరుకోగానే అప్పటికే ఓ ఫంక్షన్‌లో ఫొటోలు తీసి స్వగ్రామం కల్లూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న అన్నదమ్ములు చిన్న (28), సాయి (26) రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను ఢీకొనడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు మధ్యలోకి వచ్చింది. అదే సమయంలో వెనుకనే వస్తున్న క్రూజర్ ఢీకొనడంతో అన్నదమ్ములిద్దరూ రోడ్డు పక్కన పల్లంలోకి పడ్డారు. చిన్నా అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సాయిని స్థానికులు హుటాహుటిన పామిడిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, ప్రమాదంలో క్రూజర్ అదుపు తప్పి రోడ్డు పక్కన పల్లంలోకి దూసుకెళ్లింది. క్రూజర్ డ్రైవర్‌తో పాటు మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుల్లో చిన్నాకు భార్య ఉంది. సాయికి భార్యతో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రాజశేఖరరెడ్డి తెలిపారు.

గొర్రెల కాపరి బలవన్మరణం

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండలం లింగారెడ్డిపల్లికి చెందిన గొర్రెల కాపరి కురుబ శ్రీరాములు(43) ఆత్మహత్య చేసుకున్నాడు. గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్న ఆయనకు భార్య భారతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఆయన గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న సీఐ ఇందిరా, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కౌన్సెలింగ్‌కు హాజరైన డీఈఓ

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సెలింగ్ ప్రక్రియకు డీఈఓ మీనాక్షి హాజరయ్యారు. డివిజన్ పరిధిలోని 7 మండలాలకు సంబంధించి ఉపాధ్యాయులను డీఈఓ సర్దుబాటు చేసినట్లు ఎంఈఓ చెన్నకృష్ణ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కదిరి అర్బన్: మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన 55 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్, సీఎస్‌డీటీ సురేంద్ర తెలిపారు. అందిన సమాచారం మేరకు గురువారం తనిఖీలు చేపట్టామన్నారు. ఆ సమయంలో అక్రమంగా దాచిన రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

కదిరి టౌన్: స్థానిక మదనపల్లి రోడ్డులోని ఎంఎంఎస్ కమీషన్ మండిలో ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు గురువారం తనిఖీలు చేపట్టి 14 బస్తాల్లోని బియ్యాన్ని స్వాధీనం చేసుకుని మండి యజమాని మహమ్మద్ షమీల్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ బాబ్జాన్ తెలిపారు.